# భా.క.పా. (మావోయిస్టు) మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ అధికార పత్రిక 'పహాట్'కు కామ్రేడ్ ఆనంద్ (సి.ఆర్.బి కార్యదర్శి) ఇంటర్వ్యూ పూర్తి పాఠం

***1. ప్రశ్న: ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. భారతదేశంపై దీని ప్రభావం ఏమీ లేదని, భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదగనున్నదని మన్మోహన్‌సింగ్ అంటున్నాడు. దీని గురించి మీరేమంటారు?***

జ: ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం భారతదేశం మీద లేదని మన్మోహన్ సింగ్ చెప్పటం పూర్తి అవాస్తవం. ఇది ప్రజలను మభ్యపెట్టడానికే. దేశ ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే సంక్షోభ ప్రభావం ఏమిటో అర్థమవుతుంది. దేశాభివృద్ధికి వ్యవసాయం కీలకం అంటూనే పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నది. ఆ రంగం కూడ 2011 ప్రారంభం నుంచి ఉత్పత్తి క్షీణిస్తున్న దశలో వుంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగాల కంటే సేవల రంగం మీదే ఎక్కువగా కేంద్రీకరిస్తూ అదే పారిశ్రామిక అభివృద్ధి అని నమ్మింపజూస్తున్నది. ఇది సామ్రాజ్యవాదులకు ఉపయోగపడేదే తప్ప, దేశాభివృద్ధికి, నిలకడైన జాతీయాదాయానికి తోడ్పడేది కాదు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ ప్రభావంతో ఈ రంగం తీవ్ర ఒడిదుడుకులకు గురై, దేశ ఆర్థిక స్థితి గణనీయంగా క్షీణిస్తుంది. ఈ మూడు రంగాల ఉత్పత్తుల మొత్తం విలువ అయిన స్థూల జాతీయాదాయం ఇప్పటి వరకు 8 శాతంగా వుండగా, 2011 మొదటి త్రైమాసికంలో 6.7 శాతానికి దిగజారింది. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీనే బహిరంగంగా అంగీకరించాడు.

2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో పారిశ్రామిక రంగం నుంచి ఎగుమతులు మొదట తగ్గినా, తర్వాత పుంజుకున్నాయి. కానీ ఇటీవలి యూరప్ సంక్షోభంతో ఆ దేశాలకు ఎగుమతులు తగ్గి, పారిశ్రామిక ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఇక ముందు ఎగుమతులు ఇంకా మందగిస్తాయని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. వ్యవసాయరంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఉత్పత్తి పెరిగినా ఆహార ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిని దాటింది. రైతులకు ఖర్చులు పెరిగి, గిట్టుబాటు ధరలు లేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది ఎకరాలలో పంట విరామం ప్రకటించారు. మరో మాటలో చెప్పాలంటే రైతులు సమ్మెకు దిగారు. దీనితో వ్యవసాయోత్పత్తి క్షీణించి, ఆహార ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుంది. దీని పట్ల ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. దేశ సంపదను దోచుకు పోతున్న కార్పోరేట్లను వ్యవసాయరంగంలో ప్రవేశించటానికి కూడా ప్రభుత్వం తలుపులు బార్లా తెరుస్తున్నది. దీనితో రైతులు తమ పొలాల్లో తామే కూలీలుగా మారతారు. వ్యవసాయరంగం పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. దీని వల్ల దేశ ఆర్థిక పరిస్థితి ఇంకా దిగజారుతుంది. ఉత్పాదకతకు, స్థూల జాతీయాదాయానికి తోడ్పడే రంగాలు ఇలా నీరుగారి పోతూ, దీనికి నిలకడగా తోడ్పడని సేవలరంగం శాతం పెరిగిపోతుంటే దేశ ఆర్థిక స్థితి ఎలా బాగుపడుతుంది?

ద్రవ్యోల్బణం ఎంతకూ దిగటం లేదని, దానికి విరుగుడుగా రిజర్వ్‌బ్యాంకు పదమూడు సార్లు వడ్డీ రేట్లు పెంచింది. మళ్ళీ పెంచడానికి కూడా సిద్ధంగా వుంది. 2011–12 ఆర్థిక సం॥లో గడ్డు పరిస్థితి నెదుర్కోవాల్సి వస్తుందని, జి.డి.పి దాదాపు 7 శాతం పెరుగుదల అనుమానమేనని రిజర్వ్‌బ్యాంకు 2010–11 వార్షిక నివేదికలో ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఒక పక్క జి.డి.పి 7 శాతం కంటే దిగజారిన నేపధ్యంలో 2025 నాటికి భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద రాజ్యంగా అవతరిస్తుందని ప్రధాని మన్మోహన్‌సింగ్ అనటం ఆకాశానికి నిచ్చెనలు వేయటం తప్ప మరొకటి కాదు. మూడు సం॥లుగా ద్రవ్యోల్బణాన్ని, ధరల పెరుగుదలను అదుపు చేయలేని పాలకుల మాటలు ప్రజలెలా నమ్ముతారు? అమెరికా ఆర్థిక సంక్షోభం యూరోపియన్ దేశాలనూ చుట్టుకుంది. ప్రపంచీకరణ కారణంగా మనదేశమూ మందగమనంలో పడింది. షేర్ మార్కెట్ పడిపోయి విదేశీ పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో ఉపసంహరించుకోగా, దేశంలోని చిన్న పెట్టుబడిదారులు దాదాపు నాలుగులక్షల కోట్ల రూపాయలు నష్టపోయారు. ప్రపంచీకరణ విష వలయంలో చిక్కుకున్న ఏ దేశమూ తప్పించుకోలేదని స్వయానా ఆర్థికమంత్రి ఒప్పుకున్నాడు. మరోపక్క మనకేమీ ఫర్వాలేదు, మన ఫండమెంటల్స్ బలంగా వున్నాయంటాడు. ఇటువంటి రెండు నాల్కల పాలకులు దేశం ఆర్థికశక్తిగా ఎదుగుతుందంటే నమ్మేదెవరు?

మన దేశం నుండి విదేశాలకు పారిశ్రామిక ఎగుమతులు 6 శాతంతో పోల్చితే దిగుమతులు 19 శాతంగా వున్నాయి. పారిశ్రామిక రంగంలో 13 శాతం లోటు వుంది. అలాగే వ్యాపార రంగంలో లోటు 133 లక్షల కోట్ల రూపాయలుండగా, ఇది రాబోయే కాలంలో 300 లక్షల కోట్ల రూపాయలకు పెరగనుంది. పారిశ్రామిక వ్యాపార లోటును పూడ్చుకోవడానికి మనదేశంలో విదేశీ నిల్వలు చాలినన్ని లేవు. కేవలం 20 లక్షల కోట్ల డాలర్లు మాత్రమే వున్నాయి. కాబట్టి అనివార్యంగా మన ఆర్థిక వ్యవస్థ స్వల్పకాలిక విదేశీ పెట్టుబడులపై (ఎఫ్.ఐ.) ఆధారపడతుంది. ప్రస్తుత ప్రపంచ సంక్షోభం వలన ఈ పెట్టుబడులు రావడం లేదు. దీనితో డాలర్‌తో రూపాయి మారకపు విలువ దినదినం దిగజారి 50 రూపాయలకు పైగా పడిపోయింది. దేశంలో ద్రవ్యోల్బణం రేటు 7.47 శాతంగా ప్రమాదకర స్థాయిలో వుంది. దేశంలో పారిశ్రామిక, వ్యాపార రంగాలతో పాటు స్టాక్ మార్కెట్లతో సహా అన్ని రంగాల్లో తీవ్రమైన అనిశ్చితి కొనసాగుతున్నది.

ఇలాంటి స్థితిలో రిజర్వు బ్యాంకు తన మానెటరీ పాలసీలో వడ్డీ రేట్లు తగ్గించడం లేదా ఇతర ఉదార విధానాలు చేపట్టే అవకాశాలు ఏ మాత్రం కనపడటం లేదు. ప్రపంచీకరణను నెత్తికెత్తుకున్న దోపిడీ పాలకులు దేశాన్ని సంక్షోభం ఊబిలోకి దించుతారనేదే వాస్తవం.

ప్రభుత్వరంగ సంస్థలలోని వాటాలను అమ్మకానికి పెట్టారు. తద్వారా 40వేల కోట్ల రూపాయలు ఆదాయం సంపాదించటం లక్ష్యం. ఈ ఆదాయాన్ని ఉత్పత్తి పెంచటానికి ఖర్చు పెడతారా అంటే అదేమీ కాదు. ప్రభుత్వ ఖర్చుల కోసం మాత్రమే. కట్టుకొన్న ఇల్లు అమ్మకానికి ఎవరైనా పెట్టారంటే ఆ వ్యక్తి దివాళా తీసినట్లేగా? అలాగే ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో వాటాలు అమ్మకానికి పెట్టడం ద్వారా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎంత సంక్షోభంలో కూరుకుపోయిందో అర్థమవుతుంది. ప్రస్తుత మాంద్య పరిస్థితిలో పారిశ్రామికవేత్తలు కూడా ఈ వాటాలు కొనడానికి ఉత్సాహం చూపడం లేదు. ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం లేకుంటే బడా పెట్టుబడిదారులను ఆదుకోవడానికి మూడు లక్షల కోట్ల రూపాయలు ఉద్దీపన పథకాల కింద ఎందుకు ఖర్చు చేసినట్లు? అదే సమయంలో దేశంలో పెరిగిపోతున్న ద్రవ్యోల్బణాన్ని, ధరల పెరుగుదలను అదుపుచేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

జి.డి.పి. పెరిగితే ఉత్పత్తి పెరిగిందన్నమాట. ఉత్పత్తి పెరిగితే ఉపాధి పెరగాలి. కానీ, ప్రభుత్వ గణాంకాల ప్రకారం 1999–2005 మధ్యకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు 2.2 శాతం పెరగ్గా, 2009–10 మధ్య ఈ పెరుగుదల 0.42 శాతం మాత్రమే వుంది. సామ్రాజ్యవాద ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత రెండు దశాబ్దాల్లో దేశంలో ఉద్యోగ అవకాశాలు క్షీణించాయి. ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఉద్యోగాల తొలగింపు, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల నియామకాలు పెరిగిపోయాయి. అనేక పరిశ్రమలు మూతపడటం, ప్రైవేటీకరించటం జరిగింది. పెట్టుబడిని అనుత్పాదక వ్యయంలో ఖర్చులు– మిలిటరీ, పోలీసు ఉద్యోగాల్లో, రక్షణ రంగంలో విస్తృతంగా ఖర్చు చేస్తున్నది. విదేశీ పెట్టుబడులను మౌలిక సదుపాయాల కల్పనా (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రంగంలో– ప్రధానమంత్రి సడక్ యోజన క్రింద, 6 లైన్ల రహదారులతో పాటు ఎక్స్‌ప్రెస్ హైవేలు, అణువిద్యుత్ కేంద్రం– కుడంకుళం (రష్యాతో ఒప్పందం) వంటివి నిర్మాణం చేయటంలో ఖర్చు చేస్తున్నారు.

ఇదంతా ఆర్థిక సంక్షోభ ప్రభావం కాక మరేమిటి? ఈ సంక్షోభంలో కార్పోరేట్ పెట్టుబడి మరింత లాభాలు దండుకోగా, సంక్షోభ భారాన్ని దోపిడీ ప్రభుత్వాలు ప్రజల మీదికి నెట్టడంతో వారి స్థితిగతులు మరింత దిగజారాయి. ఇంకొక పక్క సామ్రాజ్యవాదం ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటానికి చౌక శ్రమ, ముడి పదార్థాలు, పరిశ్రమల స్థాపనకు భూముల కోసం భారతదేశంపై కన్నువేసింది. పాలకవర్గాలు సామ్రాజ్యవాదం చెప్పినట్లు నడుచుకుంటున్నాయి. ఇది దేశంలో గనుల తవ్వకాలు, సెజ్‌లు, భారీ పరిశ్రమల రూపంలో ప్రజలను విస్థాపనకు గురిచేస్తున్నది. ఇది నానాటికీ మరింతగా పెరుగుతోంది. ఇప్పుడు ఇది రిటైల్ రంగంలో, ఇంకా లాభాలు వచ్చే ఎల్.ఐ.సి వంటి రంగాల్లో విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి తలుపులు మరింత బార్లా తెరవటంగా మారింది. దీనివల్ల మరింత పెద్దయెత్తున ప్రజలు ఉపాధి కోల్పోయి పేదరికంలోకి నెట్టబడతారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా ప్రజలు వేలు, లక్షల సంఖ్యలో పోరాటాల్లోకి కదులుతున్నారు. ప్రభుత్వ క్రూర నిర్బంధాన్ని ఎదిరిస్తూ తిరగబడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కూడా ఆర్థిక సంక్షోభ భారాన్ని సామ్రాజ్యవాదం అక్కడి పాలకవర్గాలు తమ మీద మోపడానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాట్లు చేస్తున్నారు. ఈ పోరాటాలను అణచివేయడానికి, తన కంట్రోల్‌లోకి తీసుకోవడానికి సామ్రాజ్యవాదం, దళారీ పాలకవర్గాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఈ పోరాటాలన్నీ విడివిడిగా కాకుండా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టి కార్మికవర్గ నాయకత్వంలో సమన్వయంతో బలమైన ఐక్య ప్రజాఉద్యమంగా సాగించినప్పుడే సామ్రాజ్యవాదాన్ని, అది మోపుతున్న సంక్షోభ భారాన్ని ఎదుర్కోగలుగుతాము. కార్మికవర్గ పార్టీలు బలంగా వున్న దేశాల్లో వాటి నాయకత్వంలో ఈ ప్రజా తిరుగుబాట్లను విప్లవ పోరాటాలుగా మలచవలసిన అవసరం వుంది. భారతదేశంలో మావోయిస్టు పార్టీ ఇటువంటి పోరాటాలన్నింటినీ ఒక్కతాటిపైకి తీసుకురావడానికి, ఆ విధంగా ప్రజల్ని విప్లవ పోరాటంలోకి నడిపించడానికి కృషిచేస్తుంది. అంతిమంగా ప్రజలు కార్మికవర్గ నాయకత్వంలో పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను కూల్చి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థను, తద్వారా సోషలిస్టు వ్యవస్థను స్థాపించుకున్నప్పుడే ఆర్థికసంక్షోభాలకు పునాది లేకుండా పోతుంది.

### *2. ప్రశ్న: ఈ పరిస్థితికి మీ పార్టీ యిచ్చే ప్రత్యామ్నాయం ఏమిటి?*

జ: భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం. నూటికి మూడొంతుల ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అటువంటి వ్యవసాయరంగం స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటున్న ఈ 65 ఏళ్ళ కాలంలో ఎంతగా పాలకుల నిర్లక్ష్యానికి గురైందో ముందు చెప్పుకున్నాం. వ్యవసాయరంగాన్ని ఉద్ధరించడానికని ముందుకు తెచ్చిన భూసంస్కరణలు హరిత విప్లవం, ఇప్పటి సస్యవిప్లవం లాంటివన్నీ భూస్వాముల భూములను కాపాడి, ధనికవర్గాలకు మేలు చేసినవేగానీ, సామాన్యరైతుకు ఒరగబెట్టిందేమీ లేదు. గడచిన రెండు దశాబ్దాలుగా అమలవుతున్న సామ్రాజ్యవాద నూతన ఆర్థిక విధానాలు అభివృద్ధి పేరిట సెజ్‌లు, పరిశ్రమలు, గనుల ప్రాజెక్టుల కింద అరకొర భూములున్న రైతులను కూడా వారి భూముల నుండి గెంటివేస్తున్నాయి. 1991 నుంచి ఈ రెండు దశాబ్దాల కాలంలో రెండులక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

దేశంలో వాస్తవ పరిస్థితి ఇది కాగా, సామ్రాజ్యవాదులు, వారి సేవకులైన దళారీ నిరంకుశ బూర్జువా పాలకవర్గాలు దేశ సంపదను కొల్లగొట్టి, సంపద్వంతమైన ఆదివాసీ ప్రాంతాల నుండి ముడిపదార్థాలను తరలించుకుపోతున్నాయి. ఇందుకోసం నిర్మిస్తున్న నాలుగు, ఆరు లైన్ల రోడ్లు, రైల్వేలైన్లు, ప్రాజెక్టులు, పరిశ్రమలను 'అభివృద్ధి'గా చూపించి విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ అభివృద్ధి దేశంలోని లక్షలాది మంది ఆదివాసులను, దళితులను విస్థాపితుల్ని చేసింది. ఇన్నేళ్ళ స్వాతంత్ర్యం ఈ దేశంలో రైతులకు ఆత్మహత్యలు, సామాన్య ప్రజలకు దారిద్ర్యం, ఆదివాసులకు, దళితులకు విస్థాపన మిగిల్చింది.

అందుకే మావోయిస్టు పార్టీ ఈ పరిస్థితి మారాలంటున్నది. ప్రజలందరికి తిండి, బట్ట, ఉండడానికి ఇల్లు, స్వేచ్ఛ, సమానత్వాలు లభించే నూతన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం పోరాడుతున్నది. ఆ వ్యవస్థలోనే ప్రజలు తమ కాళ్ళమీద తాము నిలబడగలిగే స్వావలంబన ఆర్థిక విధానాలు అమలై, ప్రజల భాగస్వామ్యంతో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. అటువంటి ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను ప్రాథమిక రూపంలోనే అయినా మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ఈనాడు దండకారణ్య ప్రజానీకం నిర్మించేదుకు కృషి చేస్తున్నారు. వినూత్న పద్ధతుల్లో స్వావలంబన ఆర్థిక విధానాలను ఆచరణలో పెడుతున్నారు. ఇది ఏదో ఒకనాడు లేక కొద్దిరోజుల్లోనో సాధ్యమైంది కాదు. దీనికి మూడు దశాబ్దాల విప్లవోద్యమ నేపథ్యం వుంది. 1980 నుండి 95 మధ్యకాలంలో దండకారణ్యంలో కొనసాగిన తీవ్రమైన వర్గపోరాటం ఫలితంగా సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య గ్రామీణ దోపిడీ ఆర్థిక, రాజకీయ అంగాలు ధ్వంసమై, ఆ స్థానంలో 1995 నుంచి నూతన రాజ్యాధికార సంస్థలు ఉనికిలోకి వస్తున్నాయి. వీటిని విప్లవ ప్రజాకమిటీలు – క్రాంతికారీ జనతన సర్కార్లుగా పిలుస్తున్నారు. ఇవి ఈనాటి దోపిడీ రాజ్యవ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఏర్పడుతున్నాయి. 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన సాగిన తీవ్ర వర్గపోరాట ఫలితంగా దండకారణ్యంలో దాదాపు మూడు లక్షల ఎకరాల ప్రభుత్వ అటవీ భూములను ప్రజలు ఆక్రమించుకున్నారు. దీనితో దండకారణ్యంలోని అత్యధిక సంఖ్యలో రైతాంగానికి భూములు లభ్యమైనాయి. మూడు దశాబ్దాల వ్యవసాయ విప్లవంలో పేద, భూమిలేని రైతాంగం సాధించిన విజయాలలో ఇది ప్రధానమైనది.

ఈ భూములను కాపాడుకొని ఉత్పాదకత పెంచడానికి వాటిని సంస్కరించే కర్తవ్యాన్ని జనతన సర్కార్లు చేపట్టాయి. అయితే ప్రజల చేతిలో ప్రాథమిక స్థాయిలోనైనా రాజ్యాధికారం లేకుండా ఇలాంటి కర్తవ్యాలను చేపట్టడం సాధ్యం కాదని అర్థం చేసుకున్నారు. స్థానిక ప్రజలు ఎన్నుకొంటున్న జనతన సర్కార్లు తమను చుట్టుముట్టిన వేలాది శత్రు బలగాల మధ్యనే 'విప్లవ ప్రజాకమిటీలకే సర్వాధికారాలు' నినాద స్ఫూర్తితో భూసంస్కరణలకు పూనుకుంటున్నాయి. వాటికే ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నాయి.

మహత్తర నక్సల్బరీ సాయుధ పోరాట కొనసాగింపుగా ఆంధ్ర, బీహార్‌లలో గొప్ప భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు పెల్లుబికాయి. వ్యవసాయ విప్లవ కార్యక్రమంలో భాగంగా భూస్వాముల పట్టా భూములతోపాటు రకరకాల ప్రభుత్వ, అటవీ భూములను లక్షలాది ఎకరాలు ప్రజలు ఆక్రమించి సాగులోకి తెచ్చారు. అనేక ప్రాంతాల్లో ప్రజా రాజ్యాధికార అంగాలను ప్రాథమిక స్థాయిలోనే అయినా స్థాపించారు. నక్సల్బరీ, ఆంధ్ర, బీహార్ రైతాంగ పోరాటాలను అణచివేసి, ప్రజలను విప్లవోద్యమానికి దూరం చేయడంలో భాగంగా, ఆదివాసులను ఉద్ధరించడానికంటూ దోపిడి ప్రభుత్వాలు తెచ్చిన 1970 నాటి భూపరిమితి చట్టాలు గానీ, ఆదివాసీ భూబదలాయింపు నిరోధక చట్టాలు గానీ, 2006 నాటి నూతన అటవీ చట్టం గానీ, ఇంకా ఇతర ప్రభుత్వ చట్టాలేవీ ఆదివాసీ రైతాంగానికి మేలు చేయలేదు. ఇటువంటి పరిస్థితుల్లో మావోయిస్టులు ప్రజాయుద్ధం చేస్తూనే వ్యవసాయక విప్లవ లక్ష్యంలో భాగంగా విప్లవ భూసంస్కరణ కార్యక్రమాలు చేపడుతూ రైతాంగాన్ని చైతన్యవంతం చేసి ధైర్యంగా నిలబెడుతున్నారు.

దండకారణ్య క్రాంతికారీ జనతన సర్కారు జోన్ సన్నాహక కమిటీ మొదటగా 2011లో భూమి చదును కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకొన్న దండకారణ్య రైతాంగం చాలా ఉత్సాహంగా ముందుకొచ్చింది. జనతన సర్కారు కల్పించిన చైతన్యంతో ఆదివాసీ వ్యవసాయ పద్ధతుల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావడంలో భాగంగా భూమి చదును పూర్తి చేసి, మళ్ళ నిర్మాణం చేపట్టాలని గ్రహించారు. ఇవి చేయకుండా నీటితావుల దగ్గర గింజలు చల్లి వచ్చినకాడికి పంటతీసే పాత పద్ధతుల స్థానంలో ఉత్పత్తిని పెంచటం సాధ్యం కాదని అర్థం చేసుకున్నారు. ఇందుకోసం భూమి చదును – మళ్ళ నిర్మాణం పేరుతో క్యాంపెయిన్ చేపట్టారు. ఇది జనతన సర్కార్ల స్థాపనా దినం మరియు భూంకాల్ దివస్ (బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలు తిరుగుబాటు చేసి 1910లో మాడియా రాజ్య స్థాపనను ప్రకటించుకున్న రోజు) అయిన ఫిబ్రవరి 10న మొదలు పెట్టి 18 రోజుల పాటు సాగించి, జయప్రదం చేశారు.

మూడు వారాలు సాగిన ఈ ప్రజా క్యాంపెయిన్‌లో మొత్తం ఒకలక్షా ఇరవై వేలకు పైగా ప్రజానీకం పాల్గొని, 30 లక్షల పనిదినాల శ్రమ చేశారు. ఫలితంగా వెయ్యి మంది పేదరైతుల భూములు చదునై మళ్ళు నిర్మాణమయ్యాయి. అదనంగా చాలా చోట్ల రైతాంగం తమ జనతన సర్కార్ల, గెరిల్లాల అవసరాల కోసం సమిష్టి భూముల్లో కూడా పని చేశారు. రైతాంగ భూములకు అవసరమైన సాగునీటి సౌకర్యం కల్పించడానికి మొత్తంగా యాభైకి పైగా చెరువులు, కుంటలు నిర్మించారు. అక్కడక్కడ కంచెలు తీశారు. 136 మంది ఇళ్ళులేని రైతులకు కొత్తగా ఇళ్ళు నిర్మించి యిచ్చారు. ఈ క్యాంపెయిన్ కోసం జోన్ సర్కారు కేటాయించిన ఒక కోటి యాభై లక్షల రూపాయల్లో మూడవ

వంతు మాత్రమే ఖర్చయింది. జనతన సర్కార్ల పద్దుల్లో మిగులు డబ్బు రద్దు కావడమనేది వుండదు కాబట్టి, ఆ డబ్బును ఇలాంటి అవసరాల కోసమే రెండవ విడత ఖర్చుకు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ క్యాంపెయిన్ వల్ల ప్రజలు పొరుగు రాష్ట్రాలకు బ్రతుకుదెరువుకు వలస వెళ్ళడం ఆ మేరకు నిలిచింది. ఆ సమయంలో పోలీసు దాడులను ప్రజలు సామూహికంగా ఎదుర్కోవడానికి వీలయింది.

ప్రజా సంక్షేమ కార్యక్రమాల పేరిట వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుతింటూ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పనికివచ్చే వాటినే 'అభివృద్ధి'గా చూపుతున్న దోపిడి పాలకుల దగాకోరు – దివాలాకోరు ఆర్థిక విధానాలకూ, ప్రతి పైసా, ప్రతి శ్రమగంటను సద్వినియోగం చేసి అట్టడుగు ప్రజల నిజమైన అభివృద్ధిని ఆచరణలో సాధిస్తున్న ప్రత్యామ్నాయ ప్రజా ఆర్థిక విధానాలకు తేడా ఇక్కడ మనకు స్పష్టంగానే అర్థమవుతుంది. కనుకనే దండకారణ్యంలో ప్రజలు తమ విప్లవ ప్రభుత్వాలను ఏర్పరుచుకుంటూ చేపడుతున్న స్వావలంబన ఆర్థిక విధానాలే ఈ దేశానికి, పీడిత ప్రజలకు ప్రత్యామ్నాయం తప్ప మరొకటి ఏమీ లేదన్నది వాస్తవం. అయితే ఇది ఇంతవరకే పరిమితమైతే సరిపోదు. ఈ ఆర్థికాభివృద్ధి పురోగమించి వ్యవసాయ విప్లవంపై ఆధారపడిన పారిశ్రామిక అభివృద్ధి జరగాలి.

అయితే ఈ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఎదిగితే తమ ఉనికికే ప్రమాదమని దోపిడి వ్యవస్థ ఆందోళన చెందుతున్నది. అందుకే దీన్ని ప్రాథమిక దశలోనే, పూర్తిగా వికసించకుండానే పాలకులు తుపాకులతో, హింసతో, గ్రీన్‌హంట్ అనే సైనికదాడులతో తుడిచివేయాలని ప్రయత్నిస్తున్నారు. కనుక దీన్ని కాపాడుకొని, జవజీవాలందించి, వృద్ధి చేసుకోవటం నేడు దేశ ప్రజలందరి ముందున్న కర్తవ్యం.

*3. ప్రశ్న: మావోయిస్టు పార్టీ నేతృత్వంలో జరిగిన లాల్‌గఢ్ పోరాటం గొప్ప ప్రేరణనిచ్చింది. మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న ఆ తరహా పోరాటాలే అయిన నారాయణపట్నా, నియమగిరి, సోంపేట తదితర పోరాటాల గురించి వివరిస్తారా?*

జ: లాల్‌గఢ్ పోరాటం సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ పెట్టుబడికి, భూస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజా తిరుగుబాటు. ఆ తర్వాత అక్కడ రాజ్యాధికార అంగాల నిర్మాణంతో అది మరింత ఉన్నతస్థాయికి ఎదిగింది. నియమగిరి, నారాయణపట్నా, సోంపేట తదితర పోరాటాలు లాల్‌గఢ్ పోరాటానికి కొనసాగింపుగానే నడుస్తున్నాయి. ఇందులో భూమి సమస్య ప్రధానమైనది. నారాయణపట్నాలో పేదల భూమిని భూస్వాములు కబ్జా చేసుకున్న తర్వాత అక్కడి రైతాంగం మళ్ళీ తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి జరుగుతున్న పోరాటం ప్రధానమైన సమస్య. సారా పోరాటం కూడా అందులో భాగంగానే నడుస్తున్నది. ఈ మధ్యకాలంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో ముఖ్యమైన నారాయణపట్నా పోరాటాన్ని మనం గతంలో వ్యవసాయక విప్లవంలో భాగంగా నిర్వహించిన పోరాటాల కొనసాగింపులో భాగంగానే చూడాలి.

నియమగిరి పోరాటం బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్నది. బాక్సైట్ తవ్వకాల కోసం ఇక్కడి కొండలు, అడవి, మొత్తంగా పర్యావరణాన్ని ధ్వంసం చేసే పథకం కొనసాగుతున్నది. దీనికి వ్యతిరేకంగా ఇక్కడి ఆదివాసులు పోరాటం చేస్తున్నారు. లాల్‌గడ్ పోరాటం కూడా ఇటువంటిదే. ఇవి సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడి, భూస్వామ్యం అనే మూడింటికి వ్యతిరేకంగానే జరుగుతున్నాయి. నియమగిరి పోరాటం కూడా అటువంటిదే. ఒడిశాలో మొత్తంగా చూస్తే నారాయణపట్నా, ఆ పక్కనే మాలి దేవ్‌మాలి పర్వత ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాటం, దానిపక్కనే అరకు, విశాఖ మొదలైన తూర్పుకనుమల ప్రాంతమంతటా బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతున్నాయి. బాక్సైట్ తవ్వకాల వల్ల తూర్పుకనుమల సహజ సౌందర్యం, పర్యావరణం, రైతాంగం యొక్క బ్రతుకుదెరువు దెబ్బతిని పోవటం జరుగుతున్నాయి. ఇక ఇక్కడ నాల్కో కంపెనీ కోసం ఇంతకు ముందునుంచే బాక్సైట్ తవ్వకాలు జరుగుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా కూడా పోరాటం కొనసాగుతున్నది.

ఇక సోంపేట పోరాటం ఎ.వి.ఎస్ అనే ప్రైవేట్ కంపెనీ నిర్మిస్తున్న థర్మల్ విద్యుత్ కర్మాగారానికి వ్యతిరేకంగా రైతాంగం బీల భూములను (నీటి సౌకర్యంగల చిత్తడి నేలలు) రక్షించుకొనేందుకు జరుగుతున్న పోరాటం. ఇక్కడ థర్మల్ విద్యుత్ కర్మాగారం నిర్మిస్తే మత్స్యకారుల, బీల భూముల్లో పంటలు పండించే రైతుల బ్రతుకుదెరువు, పర్యావరణం ధ్వంసం అవుతాయి. లాల్‌గఢ్, నియమగిరి, సోంపేట, కళింగనగర్, పాస్కో వ్యతిరేక పోరాటాల వంటి అనేక పోరాటాలు మావోయిస్టు పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్నాయి. ఇతరత్రా కూడా అనేక పోరాటాలు కొనసాగుతున్నాయి. అలాగే దేశవ్యాప్తంగా వివిధ పార్టీలు, సంస్థల నాయకత్వంలో కూడా జైతాపూర్, కుడంకుళం అణువిద్యుత్ కేంద్రాల వ్యతిరేక పోరాటాలు కొనసాగుతున్నాయి. ఈ పోరాటాల్లో మావోయిస్టు పార్టీ ఇంకా ఎక్కువగా పాల్గొని, వీటికి నేతృత్వం వహించి లాల్‌గఢ్, నారాయణపట్నా తరహాలో బలమైన ప్రజాపోరాటాలుగా మలచవలసిన అవసరం వుంది. ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను సాయుధ పోరాటాల వైపు, ప్రత్యామ్నాయ పోరాటాల వైపు, రాజ్యాధికారాన్ని స్థాపించే వైపు మళ్ళించాలి. లాల్‌గఢ్, నారాయణపట్నా పోరాటాల్లో అదే విధంగా జరిగింది. ఈ పోరాటాలన్నిటినీ కూడా పెట్టుబడిదారీ, భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలుగా సంఘటితం చేయాల్సిన అవసరం వుంది. దేశంలో ఇటువంటి

సమస్యలు, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు అంతటా కొనసాగుతున్నాయి. వీటన్నిటికీ మావోయిస్టు పార్టీ నాయకత్వం వహించాల్సిన అవసరం వుంది.

*4. ప్రశ్న: తెలంగాణలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తీవ్రమైన పోరాటం కొనసాగుతున్నది. తెలంగాణలో మావోయిస్టు పార్టీకి బలమైన పునాది వుంది. ప్రత్యేక తెలంగాణ పోరాటానికి ఉన్న భూమిక ఏమిటి? దీనిపై మావోయిస్టు పార్టీ వైఖరి ఏమిటి?*

జ: ఒక ప్రాంతానికి చెందిన వనరులపై, విద్యా ఉపాధి అవకాశాలపై స్థానికులకే హక్కు వుండాలనేది సహజ న్యాయసూత్రం. దానికి భిన్నంగా మరొక ప్రాంతం వారు ఆధిపత్యం, దోపిడి సాగించినప్పుడు అక్కడి ప్రజలు తమ హక్కు కోసం ఉద్యమిస్తారు. నేడు 'ప్రత్యేక తెలంగాణ' రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి పునాది ఇదే. అయితే ఈ పోరాటం ఈనాటిది కాదు. నేడు తెలంగాణగా పిలువబడుతున్న నాటి హైదరాబాద్ సంస్థానం 1724లో ఏర్పడినప్పటి నుండీ, అసఫ్ జాహీల పాలనలో 'అఫాకీ'లుగా పిలువబడిన స్థానికేతరులు విద్య, ఉద్యోగ, పాలనా రంగంలో ఆధిపత్యం చలాయించడంలో, దక్కనీలుగా పిలువబడ్డ స్థానికులలో (ముల్కీ) అసంతృప్తి, ఆగ్రహం రగిలింది. ఉద్యమాలకు పురిగొల్పింది. ఆనాటి నుండి 1919లో నాటి నిజాం 'ముల్కీ' నిబంధనలు జారీ చేసేంతవరకూ ప్రజలు పోరాడుతూనే ఉన్నారు.

1947 ఆగస్టు 15 అధికార మార్పిడి తర్వాత స్వదేశీ సంస్థానాలపై బ్రిటిషర్లు అవలంభించిన విధానంతో – నిజాం నవాబు భారత ప్రభుత్వంతో 29 నవంబర్ 1947న 'యథాతథ స్థితి' కుదుర్చుకున్నాడు. అప్పటికే నిజాం సంస్థాన ప్రజలు జాతీయ పోరాటం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల స్ఫూర్తితో ఉద్యమిస్తున్నారు. 4 జూలై 1946న కడవెండి గ్రామంలో దొడ్డి కొమరయ్య అమరత్వంతో ప్రజలు సాయుధులయ్యారు. భూమి, భుక్తి, విముక్తి పోరాటంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పది లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకొని, మూడువేల గ్రామరాజ్య కమిటీల నిర్మాణంగా మారింది. భారతదేశ 'యేనాన్'గా తెలంగాణ మారుతుందేమోనన్న భయంతో నెహ్రూ, పటేల్‌లు 13 సెప్టెంబర్ 1948న కుట్రపూరితంగా 'ఆపరేషన్ పోలో' పేరుతో సైనికదాడికి పూనుకున్నారు. రజాకార్లను సాకుగా చూపి యూనియన్‌లో కలుపుకున్నారు. 17 సెప్టెంబర్ సాయంత్రం కల్లా నిజాం లొంగిపోతే యూనియన్ సైన్యాలు 21 అక్టోబర్ 1951 వరకు కమ్యూనిస్టులను, ముస్లింలను ఊచకోత కోశాయి. అందుకే సెప్టెంబర్ 17 'విద్రోహ దినంగా' పాటించబడుతోంది.

మద్రాసు రాష్ట్రంతో తెగదెంపులు చేసుకొని ఏర్పడిన 'ఆంధ్రరాష్ట్రం', తెలంగాణను కలుపుకొనేందుకు 'పెద్దమనుషుల ఒప్పందం' పేరిట జరిపిన కుట్ర కారణంగానే ఆంధ్రప్రదేశ్ సాధ్యమైంది. హద్దుల్లేని దోపిడీకి రాచబాట దొరికింది. సీమాంధ్ర ప్రాంతం నుండి వలస వచ్చిన వారు తెలంగాణలోని పేదరైతుల భూములను చౌకగా కొని ఆక్రమించుకున్నారు. నీళ్ళు, నిధులు, నియామకాలలో జరిగిన అన్యాయాలు తెలంగాణ మేధావులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను 1969లో 'ప్రత్యేక రాష్ట్రం' కోసం ఉద్యమించేలా చేశాయి.

శ్రీకాకుళ సాయుధ పోరాటాన్ని పాశవికంగా అణచివేసిన జలగం వెంగళరావే మళ్ళీ విద్యార్థి ఉద్యమాన్ని, 369 మందిని బలితీసుకున్నాడు. మార్చి 1971లో జరిగిన ఎన్నికల్లో నెత్తుటి త్యాగాలను 11 ఎం.పి స్థానాలుగా మార్చుకొన్న మర్రి చెన్నారెడ్డి సెప్టెంబర్ కల్లా కాంగ్రెస్‌లో కలిసిపోయాడు. చరిత్రలో తెలంగాణ మరోసారి ద్రోహానికి గురైంది.

ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజలు ఉద్యమించిప్పుల్లా కమిటీలు వెల్లువెత్తి తెలంగాణను ముంచివేశాయి. 1955 ఫజల్ అలీ కమీషన్, 1956లో పెద్ద మనుషుల ఒప్పందం, 1969లో అఖిలపక్ష ఒప్పందం, ఎనిమిది సూత్రాలు, 1973లో ఆరు సూత్రాలు, 1975 రాష్ట్రపతి ఉత్తర్వులు, 1986లో 610 జి.ఓ, 2004లో కామన్ మినిమమ్ ప్రోగ్రాం, రాష్ట్రపతి ప్రసంగం, 2004 ప్రణబ్ కమిటీ, 2005 గిర్‌గ్లానీ కమిటీ, 2008 రోశయ్య కమిటీ.... ఇంకా పలు పార్టీల తీర్మానాలు, మ్యానిఫెస్టోలు... అంతే కాకుండా 2009 డిసెంబర్ 9న చిదంబరం ప్రకటన, తదనంతర శ్రీకృష్ణ కమిటీ.

ఒక రాష్ట్రం ఏర్పాటుకు ఇంతటి సుదీర్ఘ తంతు అవసరమా? ఇలా ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా జరిగిందా? తెలంగాణ ఏమైనా ప్రత్యేక దేశం కావాలంటోందా?

ఎన్.డి.ఎ ప్రభుత్వం 2000లో మూడు రాష్ట్రాల ఏర్పాటు ద్వారా ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకై ఉద్యమిస్తున్న ప్రజల ఆశలు చిగురించాయి. వరంగల్ డిక్లరేషన్ తరువాత జనసభ, ఐక్యవేదికలు, విద్యార్థి, సాంస్కృతిక సంఘాలు తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాయి. బెల్లి లలిత హత్య, గద్దర్‌పై కాల్పులు, అసెంబ్లీలో యనమల రూలింగ్‌లు తెలంగాణపై సీమాంధ్ర పాలకుల స్వభావాన్ని బయటపెట్టాయి. రైతుల ఆత్మహత్యలు, అభివృద్ధి పేరిట తెలంగాణలో జరుగుతున్న విధ్వంసం, చంద్రబాబు నాయుడి నరహంతక పాలన, ఇత్యాదివన్నింటితో బొందలగడ్డగా మారుతున్న తెలంగాణను బషీర్‌బాగ్ కాల్పులు భగ్గున మండేలా చేశాయి. ఇటువంటి అత్యంత అనుకూల సమయంలో కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యేక రాష్ట్ర నినాదంతో తన రాజకీయ 'తెలంగాణ భవన్'ను నిర్మించుకున్నాడు. ఉద్యమ నిర్మాతగా కాకుండా రాత్రికి రాత్రి నాయకుడయ్యాడు. ఉద్యమమంటే ఎన్నికలు, రాజీనామాలు, లాబీయింగ్‌లనే స్థాయికి దిగజారాడు. తెలుగుదేశంకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెలుగుదేశంతో జతకడుతూ తెలంగాణ పోరాట చరిత్రను

నవ్వుల పాల్జేస్తున్నాడు.

ఈ రోజున తెలంగాణ ఉద్యమం అనేక పోరాట రూపాలు, దశల గుండా ప్రయాణించి చివరిదశకు చేరింది. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తప్ప మరొకటి తెలంగాణ ప్రజల ఆలోచనల్లో లేదు. ప్రతి ఊరు, ప్రతి వాడా, ప్రతి ఇల్లు, ప్రతి మనిషి తెలంగాణ మా జన్మహక్కు అని నినదిస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఇంతటి ఐక్యత గతంలో ఎన్నడూ లేదు. ప్రజల న్యాయమైన ఈ హక్కుకు ద్రోహం చేసేవారెవరైనా ఈ రోజు ప్రజల దృష్టిలో తెలంగాణ ద్రోహి. దోపిడి పాలకవర్గాలు, దగుల్బాజీ రాజకీయ పార్టీలు, నాయకులు తెలంగాణ ఆకాంక్షతో ఎలా ఆడుకుంటున్నారో నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజానీకానికి పూర్తిగా తేటతెల్లమైంది. వీళ్ళందర్నీ చరిత్ర పెంటకుప్పల మీదికి విసిరికొట్టే రోజు తప్పక వస్తుంది. దశబ్దాలుగా అనన్య త్యాగాలతో పోరాడుతున్న చరిత్ర తెలంగాణ ప్రజలది. అయితే ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి సరైన దిశానిర్దేశం చేసి నడిపించగల నాయకత్వం నేడు తెలంగాణ ఉద్యమానికి అవసరం. అది ప్రజల్లో నుంచే రావాలి. అటువంటి నాయకత్వాన్ని అందించగల కార్మికవర్గ పార్టీ – మావోయిస్టు పార్టీ నేడు తెలంగాణలో బలంగా లేకపోవడం ఒక అననుకూలమైన అంశమే. అయినప్పటికీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఈ స్థాయిలో కొనసాగడానికి ప్రజల్లో వున్న బలమైన ఆకాంక్ష, వారి పోరాట వారసత్వాలే కారణం. అటువంటి నాయకత్వం తయారు కాకుండా, ఉద్యమం ప్రజల చేతుల్లోకి పోకుండా పాలకవర్గాలు, దగుల్బాజీ రాజకీయపార్టీలు, నాయకులు అందరూ తీవ్రాతి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వాళ్ళ సర్వశక్తులు, యుక్తులు తెలంగాణను అడ్డుకోవడానికే వెచ్చిస్తున్నారు. సకలజనుల సమ్మెలో ఇది మరింత స్పష్టమైంది.

ఇచ్చేది మేమే, తెచ్చేది మేమే అంటూ అధికారంలోని కాంగ్రెస్; రెండుకళ్ళ సిద్ధాంతంతో తెలుగుదేశం; అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటు చేయకుండా, ఇప్పుడు కాంగ్రెస్ పార్లమెంట్‌లో బిల్లు పెడితే మేము గట్టిగా మద్దతు యిస్తాము అంటూ బి.జె.పి; కేంద్రమే పరిష్కరించాలి, మాకేమి సంబంధం లేదంటూ వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ నాయకుడు జగన్‌లు మాట్లాడుతున్నారు. తెలంగాణ ఏర్పాటైతే ఎవరికి వారు రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమాన్ని తమకు అనుకూలమైన వైపుకు మళ్ళించేందుకు ప్రతి పార్టీ ప్రయత్నిస్తున్నది. ఓట్ల రాజకీయాలను పక్కకు పెట్టి ఉద్యమాన్ని మిలిటెంట్‌గా ముందుకు తీసుకుపోవాల్సిన కీలక సమయంలో, ఈ దగుల్బాజీ పార్టీలన్నీ ఎన్నికల వైపు తిప్పి పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయి. తెలంగాణ సమస్యను ఏదోవిధంగా 2014 ఎన్నికల వరకు సాగదీయాలని ఈ పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి. ఈ పార్టీలకు వేటికీ తెలంగాణ ఆకాంక్షల పట్ల, ప్రత్యేక రాష్ట్ర సాధన పట్ల చిత్తశుద్ధి లేదు. ప్రజలందరూ త్రికరణశుద్ధిగా తెలంగాణ సాధన పట్ల దృఢనిశ్చయంతో వుండగా, ఈ ద్రోహులు ప్రజలను భ్రమల్లో ముంచి, సాగినంత కాలం సమస్యను ఎన్నికల రాజకీయాల చుట్టూ తిప్పి తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. అందుకనుగుణంగానే ఎత్తుగడలు వేస్తున్నారు. వీరి సాగదీత ఎత్తుగడలను ప్రజలు తిప్పికొడతారు.

తెలంగాణ సాధన ఎన్నికలు, రాజీనామాలు, లాబీయింగ్‌ల ద్వారా సాధ్యం కాదు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, లాయర్లు, ఉద్యోగులు, మేధావులు, కవులు, కళాకారులు, దళితులు, మైనారిటీలు, ఆదివాసులు, మహిళలు తదితర అన్ని సెక్షన్ల బలమైన విశాల ఐక్య ప్రజాఉద్యమం ద్వారానే సాధ్యమవుతుంది. ఇందుకు కిందినుండి నిర్మాణాత్మకంగా ప్రజలను సంఘటితం చేయాలి. అటువంటి సంఘటిత నిర్మాణానికి పాలకపార్టీలు వ్యతిరేకం. ఇది లేనందునే తెలంగాణ ఛాంపియన్‌ను అని చెప్పుకొనే టి.ఆర్.ఎస్, ఇంకా ఇతర రాజకీయ పార్టీలు సీమాంధ్ర పాలకవర్గాలకు అమ్ముడుపోయి, మున్నెన్నడూ లేనంతగా విస్తృత స్థాయిలో సాగిన సకలజనుల సమ్మెను నీరుగార్చి ప్రజలను నిరాశ నిస్పృహలకు గురి చేయగలుగుతున్నాయి. ఇటువంటి బలమైన విశాల ఐక్య ప్రజాఉద్యమాన్ని కిందినుండి నిర్మించడానికి మావోయిస్టు పార్టీ తన శక్తి మేరకు కృషి చేస్తుంది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ప్రజలు పోరాడేందుకు సిద్ధంగా వున్నారు. ప్రత్యేక తెలంగాణ డిమాండ్ దోపిడికి, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ముందుకొచ్చిన ప్రజల న్యాయమైన డిమాండ్. ఇటువంటి న్యాయమైన ఏ డిమాండ్‌కైనా మావోయిస్టు పార్టీ మద్దతిస్తుంది. దాన్ని సాధించేందుకు ప్రజలతో కలిసి పోరాటంలో పాల్గొంటుంది.

అదే విధంగా మావోయిస్టు పార్టీ దృక్పథంలో ప్రజలు సాధించుకోబోయే తెలంగాణ దొరల, భూస్వాముల, పెట్టుబడిదారుల తెలంగాణగా వుండాలని కాదు. తెలంగాణలోని అన్ని సెక్షన్ల ప్రజలకు వారి ప్రాతినిధ్యం మేరకు అన్నింటిలో భాగస్వామ్యం లభించే స్వావలంబనతో కూడిన 'ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ'గా వుండాలనేది మావోయిస్టు పార్టీ దృక్పథం. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనతోనే పీడిత ప్రజల బ్రతుకులు పూర్తిగా మారిపోవు. ఇదొక పాక్షిక, సంస్కరణవాద డిమాండ్. ప్రజలకు వారి ప్రాతినిధ్యం మేరకు అవకాశాలు లభిస్తాయి. అదికూడ 'ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ' సాధించినప్పుడే. లేకుంటే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వున్న పరిస్థితే వుంటుంది. పీడిత ప్రజలకు భూమి, భుక్తి, విముక్తి లభించే నూతన ప్రజాస్వామిక వ్యవస్థలోనే పూర్తిగా న్యాయం జరుగుతుంది. అందుకే ప్రత్యేక

తెలంగాణ వంటి ప్రజా ఉద్యమాలకు మద్దతిచ్చి, వాటిలో పాల్గొనటం ద్వారా మావోయిస్టు పార్టీ ప్రజలను చైతన్యవంతులను చేసి, అంతిమంగా దోపిడీ వ్యవస్థను కూల్చివేసే నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంలోకి కదిలించేందుకు కృషిచేస్తుంది.

*5. ప్రశ్న: పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ అధికారానికి రాకముందు మావోయిస్టు పార్టీకి అనుకూలంగా మాట్లాడింది. అధికారానికి వచ్చిన తర్వాత మావోయిస్టు పార్టీపై పోలీసు చర్యలుంటాయని మాట్లాడుతున్నది. దీనిపై మీరేమనుకుంటున్నారు?*

జ: పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అధికారానికి రాకముందు కామ్రేడ్ ఆజాద్ బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని, బెంగాల్‌లో కేంద్ర, రాష్ట్ర సంయుక్త బలగాలను వెనక్కు తీసుకోవాలని కొన్ని విషయాలలో మావోయిస్టు పార్టీకి అనుకూలంగా మాట్లాడింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం వైఖరే తన వైఖరనేది ప్రధానంగా స్పష్టం చేసింది. ఆ తర్వాత సంయుక్త బలగాలను ఉపసంహరించబోమని చెప్పి కొనసాగించింది. మావోయిస్టులు హింసను విడనాడాలని, నెలరోజుల కాల్పుల విరమణ అని మాట్లాడింది. కాల్పుల విరమణకు సంబంధించిన విధివిధానాలపై ఇరుపక్షాల మధ్య ఒప్పందం లాంటిదేమీ లేదు. కాల్పుల విరమణ అనేది కేవలం మమతా బెనర్జీ మాటలకే పరిమితం. బలగాలను ఉపసంహరించలేదు. క్షేత్ర స్థాయిలో దాడులు, చర్యలు ఆపింది లేదు. ఈ క్రమంలోనే వీటికి సహకరిస్తున్న తృణమూల్ పార్టీకి చెందిన ప్రజావ్యతిరేకులపై మావోయిస్టు పార్టీ స్థానిక కమిటీ చర్య తీసుకుంది. ఇదే సమయంలో జరిగిన దాడులు, చర్యలపై బెంగాల్ మావోయిస్టు పార్టీ కమిటీ ప్రకటనలు కూడా చేసింది. ఆ తర్వాత ఆయుధాలు విడిచి చర్చలకు రావాలని మమతా బెనర్జీ ప్రకటన (అల్టిమేటం) జారీ చేసింది. ఇక వెనువెంటనే మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడైన కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావు/కిషన్‌జీ/రాంజీని క్రూరంగా హత్య చేసింది. ఇది సోనియా, మన్మోహన్, చిదంబరం, మమతాల ముఠా చేసిన బూటకపు ఎన్‌కౌంటర్ హత్య అని దేశంలోని ప్రజాస్వామికవాదులందరూ మాట్లాడుతున్నా, ఒకవైపు చిదంబరం, మరోవైపు మమతా బెనర్జీలు ఇది నిజమైన ఎన్‌కౌంటరని బల్లగుద్ది సమర్థించుకుంటూ ప్రకటనలు చేశారు. ఇక సీతారామ్ ఏచూరి (సి.పి.ఎం) పరమ దుర్మార్గంగా మాట్లాడాడు. ఇదంతా పథకం ప్రకారం మావోయిస్టు పార్టీని అణచివేయడానికి పన్నిన కుట్రకు నిదర్శనం కాదా?

మమతా బెనర్జీ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువాల తొత్తు. అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశీ పెట్టుబడులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ చేసిన ప్రకటనలోనే ఆమె నిజస్వరూపం అర్థమవుతుంది. అధికారానికి రాకముందు మావోయిస్టు పార్టీకి మద్దతునిచ్చినట్లు మాట్లాడటం ప్రజల్ని మభ్యపెట్టి ఓట్లు దండుకొని, అధికారం దక్కించుకోవడానికి మమతా బెనర్జీకి అవసరం. ఇటువంటి పాలకవర్గాల నమ్మినబంట్లు ఏరుదాటాక తెప్ప తగలబెట్టటం సహజం. కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావు/రాంజీ/కిషన్‌జీ క్రూర హత్యతో మమతా బెనర్జీ నిజస్వరూపం బట్టబయలైంది. మావోయిస్టు పార్టీ అనుభవంలో ఇటువంటి పాలకులను ఎందరినో చూసింది. అధికారానికి రాకముందు ఒకవిధంగా, అధికారానికి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేకంగా వ్యవహరించటం వీరి సహజ లక్షణం. బెంగాల్‌లో గత సి.పి.ఎం పాలనకు, మమతా పాలనకు తేడా ఏమీ లేదు. అంతకంటే ఎక్కువగానే మమతా దోపిడీకి తలుపులు తెరుస్తుంది. కాకుంటే కొంతకాలం ప్రజల్ని భ్రమల్లో వుంచగలదు. భవిష్యత్తులో ఇటువంటి ఎందరో ప్రజాశతృవుల నిజస్వరూపాలను ప్రజలు చూసే కాలం వుంది. నరహంతకులు సద్భావనా మంత్రాలు జపిస్తున్నారు. అందుకే ప్రజాశతృవుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని మావోయిస్టు పార్టీ కోరుతోంది.

*6. ప్రశ్న: మహారాష్ట్ర ప్రజలకు మీరిచ్చే సందేశమేమిటి?*

జ: మహారాష్ట్రలో ప్రజలు సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య దోపిడీకి గురవుతున్నారు. జైతాపూర్ అణువిద్యుత్ కేంద్రం నుంచి మొదలు పెట్టి అనేక సెజ్‌లు, ప్రాజెక్ట్‌లు మొదలైనవి సామ్రాజ్యవాద దోపిడీకి నిదర్శనాలు. అలాగే మహారాష్ట్రలో రైతాంగ ఆత్మహత్యలు ఎక్కువగా వున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల దోపిడీ చాలా తీవ్రంగా వుంది. అత్యంత శ్రమ దోపిడీకి గురవుతున్న పేద ప్రజలున్నారు. అందువల్ల అక్కడ మావోయిస్టు పార్టీ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేపట్టడానికి చాలా అనుకూలమైన పరిస్థితులున్నాయి. ఈ ప్రజలందర్నీ విప్లవోద్యమంలోకి సమీకరించాల్సిన అవసరం వుంది.

మహారాష్ట్ర ప్రజలకు గొప్ప మిలిటెంట్ పోరాటాల చరిత్ర వుంది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా రెండవ పానిపట్ యుద్ధం, మరాఠా దేశభక్త యోధుల పోరాటాలు, బొంబాయి కార్మికుల పోరాటాలు, స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి దత్తాసామంత్ నాయకత్వంలోని కార్మిక పోరాటాల వరకు గొప్ప కార్మికపోరాటాలు సాగించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద ఎర్రజండా కింద అనేక కార్మిక, రైతాంగ పోరాటాలు, గోదావరి పరులేకర్ నాయకత్వంలోని నాసిక్ సాయుధ రైతాంగ పోరాటం, ఆ తర్వాత దళారీ నిరంకుశ బూర్జువాకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు కొనసాగిస్తున్న చరిత్ర వుంది. వర్తమానంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో బొంబాయి, చంద్రాపూర్, నాగపూర్ కార్మిక పోరాటాలు, నాసిక్ రైతాంగ పోరాటాలు, గఢ్‌చిరోలి, గోందియా జిల్లాల్లో ఆదివాసీ రైతాంగ పోరాటాలు

కొనసాగుతున్న చరిత్ర వుంది. ఖైర్లాంజి దళితుల పోరాటాలు, దళితుల ఆత్మగౌరవ (అస్మిత) పోరాటాలు కూడా కొనసాగుతున్నాయి. దళితుల పోరాటాలకు గొప్ప భూమిక వుంది. మావోయిస్టు పార్టీ దళితుల పక్షాన వుండి, వారి ఆత్మగౌరవ పోరాటాలకు మద్దతు అందించవలసిన అవసరం వుంది. ముఖ్యంగా వెనుకబడిన అటవీ, మైదాన ప్రాంతాల్లో సాయుధ పోరాటాన్ని మరింతగా అభివృద్ధి చేస్తూ, పట్టణ కార్మికవర్గాన్ని సమీకరిస్తూ బలమైన కార్మిక, కర్షక నేతృత్వంలో విప్లవోద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం వుంది.

మహారాష్ట్ర రాజకీయ రంగంలో కాంగ్రెస్, ఎన్.సి.పికి చెందిన శరద్ పవార్ చక్కెర లాబీ, శివసేన–బి.జె.పి కూటమిదే ప్రధాన ఆధిపత్యం సాగుతున్నది. పీడిత ప్రజల పోరాటాన్ని ప్రధానంగా ఈ పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాలి. అనేక దళితవాద పార్లమెంటరీ పార్టీలు దళితులను పార్లమెంటరీ రాజకీయాల వైపు లాగుతూ, పాలకవర్గాల దోపిడికి వ్యతిరేకంగా, రాజ్యాధికారం కోసమూ చేయాల్సిన పోరాటాల నుంచి దూరం చేస్తున్నాయి. మహారాష్ట్రలో ప్రధానంగా అన్నాహజారే లాంటి గాంధేయవాదులు, గాంధేయవాద సిద్ధాంతం పీడిత, మధ్యతరగతి ప్రజలను బూటకపు ప్రజాస్వామ్యం పట్ల భ్రమలు కల్పిస్తూ దోపిడీకి వ్యతిరేకంగా మిలిటెంట్ రాజకీయ పోరాటాల వైపు వెళ్ళకుండా, పాలకవర్గాలకు సేఫ్టీ వాల్వ్‌లాగా పనిచేస్తున్నాయి. దీని స్వభావాన్ని విస్తృతంగా ప్రజల్లో ఎండగట్టాల్సిన అవసరం వుంది. మహారాష్ట్ర ప్రజలు ఈ సంస్కరణవాదం, గాంధేయవాదం, పార్లమెంటరీ పార్టీల ప్రభావం నుంచి బయటపడాలి. మహారాష్ట్రలో జరుగుతున్న సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలన్నింటి ద్వారా ప్రజలు సంఘటితమై మావోయిస్టు పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంలో మమేకం కావాల్సిన అవసరం వుంది. సాయుధ విప్లవం ద్వారానే మహారాష్ట్ర ప్రజల విముక్తి సాధ్యమవుతుంది.